
బోధిసత్వ, భారతరత్న

# డా॥ బి.ఆర్. అంబేడ్కర్

(సంక్షిప్త చరిత్ర)




సరెళ్ళ వేంకట రత్నం (సవేర)

(డా॥ అంబేడ్కర్ ఇంటర్‌నేషనల్ మిషన్ లిటరరీ అవార్డు గ్రహీత)


Scanned with CamScanner



గౌతమ బుద్ధుడు



సంత్ కబీరు



మహాత్మా జోతిబా పూలె

(డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గురుత్రయం)




అంబేడ్కర్ భార్య
మాతా రమాబాయి



డా॥ అంబేడ్కర్ కుమారుడు
బయ్యాసాహెబ్ యశ్వంతరావ్ అంబేడ్కర్



డా॥ అంబేడ్కర్ సెక్రటరీ
ఎన్. సి. రత్తు



మానవ హక్కైన నీటికోసం డా॥ అంబేడ్కర్ నిర్వహించిన
మహడ్ సత్యాగ్రహం (1927)



డా॥ అంబేడ్కర్ 'రాజ్యాంగ సమర్పణ' - స్వీకరిస్తున్న
డా॥ రాజేంద్ర ప్రసాద్ & నెహ్రూ, పటేల్ మొ॥ వారు

Scanned with CamScan

# నా మాట

స్వార్థపరులు తమ సుఖం కోసమే జీవిస్తారు. సామాన్యులు తమ కుటుంబ సంక్షేమం కోసమే మనుగడ సాగిస్తారు. మహనీయులు మాత్రం సమాజ కళ్యాణం కోసం తమ జీవితాన్ని అర్పిస్తారు. అట్టి మాననీయులైన మహనీయుల జీవిత చరిత్రలు సామాన్యులకు, ముఖ్యంగా బాలలకు, యువతీయువకులకు మార్గదర్శకాలు. ఈ ప్రపంచానికి మానవతా సుగంధాలు పంచిన జ్ఞానసూర్యుడైన గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను బాల్య దశలోనే చదివి ఆయనను ఆదర్శంగా స్వీకరించిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ మేటి మానవతా మూర్తిగా, విజ్ఞాన జ్యోతిగా, భాషకందని త్యాగశీలిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, భారత రాజ్యాంగ నిర్మాతగా, భారతరత్నగా, ప్రపంచంలోనే మొదటి మేటి మేధావిగా (కేంబ్రిడ్జి యూనివర్శిటీవారి సర్వే-డిశంబర్ 2011), బోధిసత్వునిగా, నవబుద్ధునిగా వెలుగొంది ఎందరికో ఆదర్శ ప్రాయుడైనాడు.

అనేక రంగాలలో అద్భుత విజయాలు సాధించిన డా॥ అంబేద్కర్‌ని ఆదర్శంగా స్వీకరించిన లక్షలాదిమంది వివిధ రంగాలలో తమదైన ప్రత్యేకతను చాటుకుని చరితార్థులైనారు, అవుతున్నారు. అదేవిధంగా బాలలు, యువకులు ఈ భారత భాస్కరుని స్ఫూర్తి ప్రదాతగా స్వీకరించి వారి భావి జీవితాలలో విజయపతాకాలను ఎగురవేయాలని, కీర్తి శిఖరాలను చేరుకోవాలని నా ఆశ, ఆకాంక్ష. అందుకే ఆయన జీవిత విశేషాలలోని కొన్ని ముఖ్యాంశాలను సూర్యుణ్ణి అద్దంలో చూపినట్లు, సముద్రాన్ని గరిటెతో కొలిచినట్లు ఈ సంక్షిప్త గ్రంథంలో పొందుపరిచాను. పాఠకులు ఈ పుస్తకాన్ని చదివిన తరువాత పొందిన అనుభూతితో డా॥ అంబేద్కర్ గురించి మరింత విపులంగా అధ్యయనం చేసి, మేటి మేధావులుగా ఎదిగి సమాజ కళ్యాణానికి అంతకితమవుతారని ఆశిస్తున్నాను.

డా॥ అంబేద్కర్ సాధించిన విద్యా - ఉద్యోగ - రాజకీయాది రాయితీలతో అన్ని విధాల అభివృద్ధిచెందిన దళిత ఉద్యోగులు, నాయకులు ఈ చిన్ని పుస్తకాన్ని పెద్ద మనస్సుతో అధిక సంఖ్యలో కొని, హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు తమ కానుకగా అందించాలని కోరుచున్నాను. అట్లే మాననీయ సాంఘిక సంక్షేమ శాఖామాత్యుల వారి సౌజన్యంతో సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, గురుకుల పాఠశాలల నిర్వహణాధికారులు ఈ పుస్తకాలను అధిక సంఖ్యలో కొనుగోలుచేసి ప్రతి హాస్టల్ విద్యార్థికి అందజేయ గలందులకు అభ్యర్థిస్తున్నాను.

అమలాపురం, 04-04-2016 బుధజన విధేయుడు మీ... సవేర

రచన & ప్రచురణ : **సరెళ్ళ వేంకటరత్నం (సవేర)** బౌద్ధధమ్మ అధ్యయన కేంద్రం, వెంకటకృష్ణాపురం కాలనీ, అమలాపురం - 533 201. సెల్ : 9949751916.

మొదటి ముద్రణ : 14 ఏప్రియల్, 2010 - 20వ ముద్రణ : 10-11-2018

మూల్యం : రూ. 7/- మాత్రమే

ముద్రణ : ఈశ్వర ఆఫ్‌సెట్ & కోలా ఆఫ్‌సెట్, రాజమండ్రి

బ్యాంక్ ఆన్‌లైన్ నెంబర్ : ఆంధ్రాబ్యాంక్, కొంకాపల్లి బ్రాంచ్, అమలాపురం,
ఎసి నెం. 080610011006655.
ఐ.ఎఫ్.ఎస్.సి.నెం. : ANDB0000806

## బహూకరణ

*With Best Complements From :*
**S. Nirmala & Narsimulu**
Gangyada (V), Nawabpet (M),
Vikarabad Dist - 501 101, Mobile : 9686565501



Scanned with CamScanner

## జననం – జన్మస్థలం :

డా॥ అంబేద్కర్ తల్లి భీమాబాయి. తండ్రి రాంజీ సక్పాల్. వీరు మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబవాడ వాస్తవ్యులు. రాంజీ మధ్యప్రదేశ్‌లోని "మౌ" అనే పట్టణంలో సుబేదారుగా (ఆర్మీ) పనిచేస్తుండేవాడు. అక్కడే అంబేద్కర్ 1891 ఏప్రియల్ 14వ తేదీన, 14వ సంతానంగా జన్మించాడు. ఆరేళ్ళ పసితనంలోనే తల్లిని కోల్పోయిన భీమారావు తండ్రి చక్కని క్రమశిక్షణలో, మేనత్త మీరాబాయి చల్లని సంరక్షణలో అందరికీ ముద్దుగా పెరిగి పెద్దవాడైనాడు.

## బాల్యం – విద్యాభ్యాసం :

రాంజీ మిలిటరీ ఉద్యోగమునుండి రిటైరయిన తరువాత చిన్న ఉద్యోగంతో సతారాలో స్థిరపడ్డాడు. భీమారావును 1900 సంవత్సరం నవంబరు 7వ తేదీన సతారాలోని ప్రభుత్వ పాఠశాలలో "భీమారావ్ రాంజీ అంబవాడ్కర్" పేరుతో చేర్పించాడు. అక్కడ భీమారావును బాగా అభిమానించిన "అంబేద్కర్" అనే ఇంటిపేరుగల ఉపాధ్యాయుడు భీమారావు ఇంటి పేరు "అంబవాడ్కర్"ను "అంబేద్కర్"గా మార్పు చేసాడు. అంబేద్కర్ చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరమైనా, పేదరికం పెనుసవాలుగా మారినా, అంటరానితనం వెంటబడి తరిమినా శ్రద్ధాసక్తులతో, దీక్షాదక్షతలతో చదువు కొనసాగించాడు. పువ్వు పుట్టగనే పరిమళించినట్లు, సూర్యుడు ఉదయిస్తూనే కోటి కాంతులు వెదజల్లినట్లు 1907లో మంచి మార్కులతో మెట్రిక్యులేషన్ (ఇప్పటి 10వ తరగతికి సమానం) పరీక్ష పాసయినాడు. ఆ రోజులలో 'మహర్' కులానికి చెందినవారు మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణుడు కావడమే ఒక ఘనకార్యం. అందుకే బొంబాయి పట్టణంలోని మహర్ కులస్థులు అంబేద్కర్‌కి అభినందనసభ ఏర్పాటుచేసారు. ఈ సభలో ప్రముఖ సంస్కర్తయైన ఎస్.కె. భోలే అధ్యక్షునిగాను, ప్రసిద్ధ రచయిత, సంస్కర్త, ఉపాధ్యాయుడైన కృష్ణాజీ కేలూస్కర్ ముఖ్య అతిధిగాను పాల్గొని అంబేద్కర్‌ను అభినందించారు. అటుపైన అతని ఉన్నత చదువులకు ప్రోత్సహించారు. భీమారావుకి అప్పటి ఆచారం ప్రకారం 17 ఏండ్ల వయస్సులోనే తొమ్మిదేండ్ల వయస్సుగల 'రమాబాయి'తో వివాహం అయింది. "వివాహం విద్యకు ప్రతిబంధకం" - అనే నానుడి ఉన్నా, భీమారావు దీనిని అధిగమించి బొంబాయిలోని ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో బి.ఏ., చదివి కళాశాలకే ప్రథమునిగా ఉత్తీర్ణుడైనాడు. అటుపైన కేలుస్కర్ పండితుని అభ్యర్థనపై బరోడా మహారాజైన శాయాజీరావ్ గైక్వాడ్ అందించిన ఆర్థిక సహాయంతో భీమారావు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాడు. విదేశీ విద్యకి నోచుకొన్న మొదటి మహర్ కులస్థుడుగా రికార్డు సృష్టించాడు.

భీమారావు 1913లో కొలంబియా యూనివర్శిటీలో చేరాడు. ఆర్థిక శాస్త్రం ప్రధాన పాఠ్యాంశంగా, సోషియాలజీ, హిస్టరీ, ఫిలాసఫీ, పాలిటిక్స్, ఆంత్రోపాలజీ ఇతర అంశాలుగా శ్రద్ధగా చదివి 1915లో ఎం.ఏ., డిగ్రీ తీసుకున్నాడు. 1917లో ఇదే యూనివర్శిటీ నుండి డాక్టరేట్ డిగ్రీ పొందాడు. 1916లో ఇంగ్లండులోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ & పొలిటికల్ సైన్స్‌లో చేరి ఎం.ఎస్‌సి., (ఎకనామిక్స్), డి.ఎస్‌సి., (ఎకనామిక్స్) డిగ్రీలు అందుకొన్నాడు. అప్పటిలో అర్థశాస్త్రంలో మూడు మాస్టర్ డిగ్రీలు సాధించిన ఏకైక వ్యక్తి ఆసియా ఖండములో అంబేద్కర్ ఒక్కడే. ఇదే కాలంలో గ్రేస్ ఇన్ విద్యాలయంలో బారిష్టర్ -



Scanned with CamScan

ఎట్ - లా (లాయర్ కోర్సు) పూర్తి చేసాడు. 1922లో జర్మనీలోని బాన్ యూనివర్శిటీలో తర్కశాస్త్రం, అర్థశాస్త్రంలను అధ్యయనం చేసాడు. కొలంబియా విశ్వవిద్యాలయం తమ పూర్వ విద్యార్థి అయిన అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా చూపిన అపూర్వ ప్రతిభను మెచ్చి, 1952లో LL.D., (డాక్టర్ ఆఫ్ లా) గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి సత్కరించింది.[1] ఆ తరువాత 1953 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం D.Litt., (డాక్టర్ ఆఫ్ లిటరేచర్) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దేశంలోని ఇతర విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను ఈయనకు ప్రదానం చేసి ప్రశస్తినొందదానికి బదులు వాటి సంకుచితత్వాన్ని చాటుకున్నాయి.

ఈ విధంగా డా॥ అంబేద్కర్ M.A., M.Sc., Ph.D., D.Sc., LL.D., D.Litt., J.P. Bar - at - Law - ఏడు డిగ్రీలను సాధించాడు. అట్లే హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఫిలాసఫీ, లా వంటి ఏడు శాస్త్రాలను క్షుణ్ణంగా అభ్యసించాడు. అంతేగాక మరాఠి, హిందీ, గుజరాతీ, ఇంగ్లీషు, పార్శీ, సంస్కృతం, పాళీ - ఇలా ఏడు భాషలలో పాండిత్యాన్ని గడించాడు.

## ఆదర్శప్రాయుడైన పుస్తక ప్రియుడు :

డా॥ అంబేద్కర్‌కి పుస్తకాలంటే ప్రాణం. "నేను నా భార్యాబిడ్డలకన్నా పుస్తకాలనే ఎక్కువగా ప్రేమిస్తాను. పుస్తకాలు దీపాలవంటివి. అవి మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తాయి, నా జీవితాంతం వేలాది గ్రంథాలను అవిశ్రాంతంగా అధ్యయనం చేయడం వలననే నేనింతటి మేధాసంపన్నుడనయినాను. అధ్యయనం లేకుండా జ్ఞానం పెరుగదు. జ్ఞానం లేకుండా శక్తి కలుగదు" - అనేవాడు. ఆయన లండన్ మ్యూజియం లైబ్రరీ, లండన్ సిటీ లైబ్రరీ, ఇండియన్ ఆఫీస్ లైబ్రరీ, గోల్డ్‌స్మిత్ ఎకనామిక్స్ లైబ్రరీ, లండన్ యూనివర్శిటీ లైబ్రరీలలో గల వేనవేల గ్రంథాలను చదివాడు. అంతేగాక వేదాలు (4), బ్రాహ్మణాలు (4), వేదాంగాలు (6), ఉపనిషత్తులు (12), పురాణాలు (18), ఇతిహాసాలు (2) భగవద్గీత, బైబిలు, ఖురాను, బౌద్ధగ్రంథాలను (సుమారు 2000 మత గ్రంథాలు) పరిశోధనాత్మకంగా అధ్యయనం చేసాడు. ఇంకా జోడ్, జోన్‌డియా,రస్సెల్, హెగెల్, అరిస్టాటిల్, బేకన్, మార్క్స్, వాల్టేర్, రూసో వంటి ప్రసిద్ధ తత్వవేత్తల గురించి, వారి సిద్ధాంతాల గురించి లోతుగా అవగాహన చేసుకొన్నాడు. రొట్టెలు కొనే సొమ్ముతో సైతం పుస్తకాలు కొనేవాడు. రోజులో 18 గంటలు చదువుతూనే ఉండేవాడు.

## ప్రపంచ ప్రఖ్యాత గ్రంథకర్త :

సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం. ప్రజలను చైతన్యపరిచేదిగాను, వారి సమస్యలకు పరిష్కారాన్ని చూపేదిగాను సాహిత్యముండాలి. అట్టి గ్రంథాలను అందించే రచయితలే క్రాంతదర్శులూ, మార్గదర్శకులుగా చరిత్రలో నిలిచిపోతారు. డా॥ అంబేద్కర్ రచనలన్నీ దళిత బహుజనులకు, సమస్త పీడిత జనులకు అక్షరాయుధాలుగా, చైతన్య పతాకాలుగా, క్రాంతి జ్యోతులుగా, వెలుగుబాటలుగా విరాజిల్లుతున్నాయి. అందుకే డా॥ అంబేద్కర్ రచనలూ

1. ఇదే యూనివర్శిటీలో డా॥ అంబేద్కర్ విగ్రహం నెలకొల్పబడింది. అట్లే ది. 8-4-2010 తేదీన ఇక్కడ ఆయన పేరన పీఠం (Chair) ఏర్పాటు చేయబడింది.



Scanned with CamScanner

- ప్రసంగాలు అన్నింటినీ ఆంగ్ల భాషలోనూ, దేశంలోని అన్ని ముఖ్య భాషల్లోను ముద్రించబడుతున్నాయి. (ఇప్పటికి 22 సంపుటాలు వెలువడ్డాయి). ఆయన రచించిన వాటిలో కొన్ని - 1. రూపాయి విలువ, 2. ఇండియాలో కులాలు, 3. కులనిర్మూలన, 4. థాట్స్ ఆన్ పాకిస్థాన్, 5. అస్పృశ్యులెవరు?, 6. శూద్రులెవరు?, 7. విప్లవం - ప్రతివిప్లవం, 8. స్టేట్స్ & మైనారిటీస్, 9. రనడే - గాంధీ - జిన్నా, 10. కాంగ్రెసు & గాంధీ అస్పృశ్యులకేమిచేసారు?, 11. హిందూమతం - చిక్కుముడులు, 12. బుద్ధుడు - బౌద్ధధమ్మం మొదలైనవి. ఈ గ్రంథ రతనాలన్నీ చరిత్ర - రాజకీయ - ఆర్థిక - సాంఘిక - మత - తాత్వికాధి అంశాలపై వివరణాత్మకంగా రాయబడి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిచెందాయి. ఆయన రచనలపైన, జీవిత విశేషాలపైన అనేకమంది మేథావులు పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక యూనివర్శిటీలలో ఆయన పేర అధ్యయన కేంద్రాలు, పీఠాలు వెలిసాయి. విగ్రహాలు నెలకొల్పబడ్డాయి. అనేక సెమినార్‌లు నిర్వహించబడుతున్నాయి,

## విశ్వవిఖ్యాత ఉపన్యాసకుడు – విమర్శకుడు :

నూరు మందిలో ఒక శూరుడూ, వెయ్యి మందిలో ఒక పండితుడూ, లక్ష మందిలో మాత్రమే ఒక విలక్షణమైన వక్త ఉంటారని ఆర్యోక్తి. అంటే వక్తృత్వం అంత కష్టమైన కళ. డా॥ అంబేద్కర్ అనేక భాషలలో అనేకానేక అంశాలపై దేశవిదేశాలలో ప్రసంగించి ప్రపంచ ప్రఖ్యాత వక్తగా పేరొందాడు. ఆయన ప్రతి ప్రసంగానికి ప్రణాళిక - సమాచార సేకరణ - సమర్పణ అనే మూడంశాలతో సిద్ధపడేవాడు. చక్కని భాషలో, విషయ సమగ్రతతో ఆసక్తికరంగా మాట్లాడేవాడు. ముంబాయి శాసనసభ నుండి లండన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ దాకా; మహడ్ ఉద్యమ వేదిక నుండి ప్రపంచ బౌద్ధ మహాసభల దాకా ఆయన ప్రసంగాలకు ఒక చారిత్రక గుర్తింపు ఉంది. అందుకే ఆయన రచనలతో పాటు ప్రసంగాలు కూడా (సంపుటి - 17 - 3 భాగాలు) అమూల్య గ్రంథాలుగా ప్రచురింపబడుతున్నాయి. వీటిలో 'కులనిర్మూలన' అనే గ్రంథం కులాల గురించి వెలువడ్డ సుమారు 3500 గ్రంథాలలో మేటి గ్రంథంగా ఆచరణ పథంగా నేటికీ పరిగణింపబడుతోంది.

## విద్యారంగానికి నూతనోత్తేజం నింపిన అధ్యాపకుడు :

డా॥ అంబేద్కర్‌కి ఇష్టమైన వృత్తి అధ్యాపక వృత్తి. అందుకే ఆయన 1918లో బొంబాయి (ఇప్పటి ముంబై) లోని సెడెన్‌హామ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరి రెండున్నర సంవత్సరాల పాటు పొలిటికల్ ఎకానమీని బోధించాడు. ఆయన చెప్పే పాఠ్యాంశాలను ఇతర కళాశాలల, విభాగాల విద్యార్థులు కూడా ఆసక్తిగా వినేవారట. అట్లే బాట్లీబోయిస్ ఎకౌంటెన్సీ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్‌లో లెక్చరరుగా పనిచేసాడు. బొంబాయిలోని ప్రభుత్వ లా కళాశాల లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలందించాడు. డా॥ అంబేద్కర్ తన వృత్తిపట్ల నిబద్ధత, అంకిత భావం గల అధ్యాపకునిగా విద్యార్థులకు చిరస్మరణీయుడైనాడు. లా కళాశాలను తీర్చిదిద్దిన పాలనాదక్షుడైన ప్రిన్సిపాల్‌గా ఎందరికో ఆదర్శప్రాయుడైనాడు. విద్యారంగానికే ఒక స్ఫూర్తి ప్రదాత అయినాడు.



Scanned with CamScanner

## చైతన్య ప్రతీకలైన పత్రికల వ్యవస్థాపకుడు :

సమాజానికి మార్గదర్శి పత్రిక. అందుకే "పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు; పత్రికొక్కటున్న మిత్రకోటి; ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న" - అని చెప్పిన నార్ల వెంకటేశ్వరరావు కంటే ముందుగా, మరింత సమున్నతంగా డా॥ అంబేద్కర్ ఆలోచించి పీడిత ప్రజల చీకటి బ్రతుకుల్లో అక్షరజ్యోతులై వెలుగొందే - 1. మూక్‌నాయక్, 2. బహిష్కృత భారత్, 3. జనత, 4. సమత, 5. పీపుల్స్ హెరాల్డ్ వంటి మరాఠీ - ఆంగ్ల పత్రికలను ప్రారంభించి జయప్రదంగా నిర్వహించాడు. ఇవి దళిత ప్రజల ఉద్యమ వాణిగా, చైతన్య దీపికగా, అవసరాల నివేదికగా, అభివృద్ధికి దిక్సూచిగా ఎంతగానో తోడ్పడ్డాయి.

## నిస్వార్థ - నిబద్ధ న్యాయవాది :

డా॥ అంబేద్కర్ ఇంగ్లాడ్ దేశపు రాజధాని అయిన లండన్ నగరంలోని "గ్రేస్ ఇన్" విద్యాలయంలో బారిష్టర్-ఎట్-లా (లాయరు కోర్సు) పూర్తిచేసుకొని 1923లో ఇండియాకు తిరిగి వచ్చాడు. ముంబాయి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించాడు. ఒక దళితుడు న్యాయవాదికావడమే అరుదైన కాలంలో అత్యున్నత విద్యను అభ్యసించిన, అత్యంత ప్రతిభాశాలి అయిన న్యాయవాదిగా పేరొందినాడు. ఒక ఉన్నతోద్యోగిగా గాని, ఉన్నత న్యాయమూర్తిగా గాని స్థిరపడి, సుఖపడే అర్హతలు, అవకాశాలు మెండుగా ఉన్నా ఆయన న్యాయవాద వృత్తిని ఎంచుకొని, తన అణగారిన ప్రజల సముద్ధరణ కోసం సాంఘిక విప్లవ నేతగా, ప్రజాహిత రాజకీయవేత్తగా, నిబద్ధ రచయితగా, నిస్వార్థ విద్యావేత్తగా జీవితాన్ని కొనసాగించాడు. అప్పటి బొంబాయి నగరం నలుమూలల నుండి అనేకమంది నిరుపేద దళితులు ఆయన న్యాయ సలహాకోసం, సహాయం కోసం వచ్చేవారు. డా॥అంబేద్కర్ వారికి ఉచితంగానే న్యాయ సలహాలు ఇచ్చేవాడు. ఫీజులు తీసుకోకుండానే వారి కేసులు వాదించేవాడు. వారి దీన, హీన స్థితి పట్ల అనిర్వచనీయమైన ఆత్మీయతనూ, సానుభూతిని ప్రదర్శించేవాడు. అంకిత భావంతో వారికి న్యాయంచేకూర్చి పంపేవాడు. బ్రిటిషు న్యాయమూర్తులను సైతం మెప్పించే ఆంగ్లభాషా ప్రావీణ్యంతో, సీనియర్ లాయర్లనైనా ఒప్పించే వాదనా పటిమతో స్వల్పకాలంలోనే సాటిలేని మేటి న్యాయవాదిగా అందరి ప్రశంసలనందుకున్నాడు. న్యాయవాదుల మధ్య అశాస్త్రీయమైన స్థాయీ భేదముల నిర్మూలన కోసం న్యాయ విద్యలో సంస్కరణలను సూచిస్తూ ఒక మహాగ్రంథాన్ని రచించాడు. దీనిలోని సూచనలు న్యాయవాదులందరికీ చక్కని మార్గదర్శక సూత్రాలుగా శిరోధార్యమైనాయి. ఆ తరువాత అధికార పక్షానికి చెందకపోయినా, ప్రధాని నెహ్రూ ఆహ్వానాన్ని మన్నించి స్వతంత్ర భారత దేశానికి ప్రథమ న్యాయ శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించి అపూర్వ సేవలందించాడు. ప్రతిభ-సేవాదృక్పథం, నిబద్ధత - అంకితభావం సమపాళ్ళలో పరిమళించిన న్యాయవాదిగా, న్యాయ శాస్త్రాచార్యునిగా, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా, న్యాయశాస్త్రకోవిదునిగా, న్యాయ శాఖామాత్యునిగా ఎందరికో ఆదర్శ ప్రాయుడైనాడు. న్యాయవాద వృత్తికి, న్యాయశాఖామంత్రి పదవికి, న్యాయశాస్త్రానికి, రాజ్యాంగ శాస్త్రానికి అపూర్వ అలంకారమైనాడు.



Scanned with CamScan

## సమున్నత సంస్కర్త – సాంఘిక విప్లవనేత :

ప్రపంచంలో ఏ దేశములోను లేని అనాగరికమైన, అమానుషమైన [1]అస్పృశ్యత కులవ్యవస్థలు మన భారతదేశములో మాత్రమే ఉన్నాయి. వీటికి హిందువులు పవిత్రంగా భావించే మత గ్రంథాలు వత్తాసు పలుకుతున్నాయి మహిమాన్వితులుగా, దైవ సమానులుగా పూజలూ, సేవలందుకునే మహర్షులూ, స్వాములూ, బాబాలూ, యోగులలో ఏ ఒక్కరూ వీటి నిర్మూలనకు పాటుపడలేదు. ఈ నీచ దురాచారాలను బాల్యమునుండి స్వయముగా అనుభవించిన డా॥ అంబేద్కర్ వీటిని సమూలంగా, చట్టబద్ధంగా రూపుమాపేందుకు అనేక సాంఘిక పోరాటాలను నిర్వహించాడు. వాటిలో కొన్నిటిని క్లుప్తంగా తెలుసుకొందాం.

## చారిత్రాత్మక మహద్ పోరాటయోధుడు, విజేయుడు :

బొంబాయి ( నేటి ముంబై) సమీపంలోని కొలాబా జిల్లాలోని మహద్ మున్సిపాలిటీకి చెందిన 'చౌదర్' చెరువు నీటిపై అన్నికులాలవారికి సమాన హక్కు ఉంది. అయినా ఆపట్టణంలోని అగ్రకులాలవారు అచ్చుటి నిమ్న (మహర్, మాంగ్ మొ॥ కులాలవారిని అంటరానివారిగా భావించి ఆ చెరువు నీటిని వాడుకోకుండా అడ్డుకున్నారు. ఈ క్రూరమైన కులవివక్షతనూ అమానవీయమైన అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ డా॥అంబేడ్కర్ 1927 మార్చి నెల 19వ తేదీన వేలాది మంది నిమ్న జాతీయులతో మహద్‌లో ఒక మహాసభను నిర్వహించాడు. 20వ తేదిన తన అనుచరులతో చెరువులోకి దిగి ఆనీటిని దోసిళ్ళతో త్రాగాడు. కాని నిమ్న జాతుల స్పర్శతో చెరువు నీరు మైలపడిందని ఛాందస అగ్రవర్ణాలవారు ఆవు పేడతో, ఆవు మూత్రముతో, ఆవు పెరుగుతో శుద్ధి కార్యక్రమం చేపట్టారు. ఆపైన నిమ్నులకు కనీసపు నీటి హక్కు కూడా దక్కకుండా మహద్ సబ్ జడ్జ్ కోర్టు ఉత్తర్వులతో అడ్డుకున్నారు. అటుపైన డా॥అంబేద్కర్ అలుపెరగని న్యాయ పోరాటంతో, 1937లో బొంబాయి హైకోర్టు ద్వారా చౌదర్ చెరువుపై నిమ్నులకు సంపూర్ణ హక్కును సాధించాడు.

## మనుస్మృతిని దహనం చేసిన మహాసాహసికుడు :

భారతదేశంలో కులవ్యవస్థనూ, అస్పృశ్యతనూ, స్త్రీల అస్వతంత్రతనూ నిర్దేశించిన అధర్మ శాస్త్రం మనుధర్మశాస్త్రం. శూద్రులూ, అస్పృశ్యులూ వేదాలను వింటే సీసం కరిగించి చెవుల్లో పోసి, పలికితే నాలుకలు కోసి చంపాలని ఆదేశించినది ఈ అన్యాయ శాస్త్రమే. భారతీయులందరికి ఒకే విధమైన స్వాతంత్ర్యం, సమానత్వం అందకుండా, వారి మధ్య సోదరత్వం చిగురించకుండా మానవతకే చితిని పేర్చిన స్మృతి మనుస్మృతి. అందుకే డా॥ అంబేద్కర్ మహద్ పోరాటంలో భాగంగా, 1927 డిసెంబరు 25వ తేదీన ఆరువేలమంది దళితుల జయ జయ ధ్వానాల మధ్య మనుస్మృతిని దహనం చేసాడు.

1. రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్ ప్రకారం 1947లో రాజ్యాంగ పరిషత్ అస్పృశ్యతను నిషేధిస్తూ ప్రకటన చేసి 1948లో ఆమోదించింది. అప్పటి వరకు మన దేశంలోని షెడ్యూల్డ్ (నిమ్న/ దళిత) కులాలవారి పట్ల అగ్రకులాల వారు అస్పృశ్యతను పాటించేవారు.



Scanned with CamScan

క్రీ.శ. 175 నుండి ఈ దేశంలో అసమానతని, అన్యాయాన్ని, మతతత్వాన్ని, కులతత్వాన్ని, అంటరానితనాన్ని, బానిసత్వాన్ని పెంచి పోషించిన ఈ దుష్ట హిందూ ధర్మశాస్త్రాన్ని ఖండించి భస్మం చేయడం ద్వారా కుల–వర్గ రహిత సమసమాజ నిర్మాణానికి మార్గదర్శి అయినాడు. మహడ్ సత్యాగ్రహం, మనుస్మృతి దహనం ఈ రెండు సంఘటనలు 20వ శతాబ్దపు గొప్ప సాంఘిక విప్లవముగా మానవేతిహాసముతో నిలిచిపోయాయి. మనుస్మృతి దహన దినమైన ఈ డిశంబరు 25 పీడిత జన విజయోత్సవ దినంగా భారత చరిత్రలో స్థిరపడిపోయింది.

## ఛాందసత్వ విరోధి – ఆలయ ప్రవేశోద్యమ సారథి :

డా॥అంబేద్కర్ బాల్య దశలోనే గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను భక్తి శ్రద్ధలతో చదివాడు. సమత, మానవత, ప్రజ్ఞ, కరుణ, స్వేచ్ఛ, శీలం, మైత్రి, సాంఘికన్యాయం ఇత్యాది అంశాలకు అత్యధిక ప్రాధాన్యతగల బుద్ధుని బోధనలపట్ల ఆకర్షితుడైనాడు. అట్లే అంటరానితనం, కులతత్వం, అసమానత్వం, మతమౌఢ్యం వంటి అమానవీయ లక్షణాలుగల హిందూ మతంపైన అయిష్టతను పెంచుకొన్నాడు. అయినా ఈ దేశపౌరులైన, హిందువులుగా పరిగణింపబడుతున్న [1]దళితులకున్న హక్కుల పట్ల [2]అగ్రవర్ణాల దృక్పధాన్ని లోకానికి చాటిచెప్పేందుకే ఈ దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

మొదటిగా బొంబాయిలో 1927లో క్రొత్తగా నిర్మించిన 'ఠాకూర్ ద్వార్' ఆలయంలోకి అన్నికులాల వారికి ప్రవేశముందని ఆలయాధికారుల ద్వారా తెలుసుకొని శివతర్కార్‌తో కలిసివెళ్ళాడు. కాని అక్కడ కొందరు కులోన్మాదులు ప్రజలను రెచ్చగొట్టి అంబేద్కర్ ప్రవేశాన్ని ఆటంకపరిచారు. అటుపైన పురోహిత వర్గం ప్రాయశ్చిత్త (శుద్ధి) కర్మలు జరిపించారు. ఇదేవిధంగా కేరళలోని గురువాయుర్ (శ్రీకృష్ణ దేవాలయం,) పూనా, (పార్వతీ దేవి గుడి) [3] నాసిక్ (కాలారాం దేవాలయం) రత్నగిరి, కార్వార్, అమరావతి, మన్సీగంజ్, మద్రాసు (నేటి చెన్నై) మధురై, తిరువాన్కూర్, రామ్‌నాథ్, ఖుల్నా, బెంగాల్ వంటి ప్రదేశాలలో నిర్వహించిన ఆలయ ప్రవేశ ఉద్యామాలన్నిటిని అంటుజాడ్యంపట్టిన అగ్రకులస్థులు వ్యతిరేకించి నిరోధించారు. సత్యాగ్రాహిగా పేరొందిన గాంధీ ,ఆయన అనుచరులు దళితుల సత్యాగ్రహానికి అణుమాత్రమైనా సహకరించలేదు. ఈ సందర్భంగా "మీలో మానవత్వం, నాగరికత ఉంటే మీ ఆలయాల్లోకి మమ్మల్ని రానివ్వండి. లేకుంటే వాటి తలుపులు గట్టిగా బిగించుకోండి. మాకిక ఆలయాలపై ఎటువంటి ఆసక్తి లేదు." అని హెచ్చరికగా ప్రకటించాడు, డా॥అంబేద్కర్.

1. దళితులు హిందువులు కారు. ఒక ప్రత్యేక వర్గానికి చెందిన వారు, ఆదిబౌద్ధులు, 2. గుడిని కట్టిన, శిలనుండి దేవుడి శిల్పాన్ని చెక్కిన దాన్ని గుడిలోకి తెచ్చిన దళితుడుని గుడికి దూరంగా ఉంచారు. 3.నాసిక్ సత్యాగ్రహం (1937)లో 15వందల మంది పురుషులు 5 వందల మంది స్త్రీలు పాల్గొన్నారు. రథోత్సవంలో సవర్ణులు చేసిన మోసంతో ఈగుడి ఒక ఏడాది పాటు మూతపడింది. దళితులు వెలివేయబడి బడికి, బావికి, దుకాణాలకు దూరంగా ఉంచబడ్డారు.



Scanned with CamScanner

## పతన్ దార్ మహర్ల విముక్తి ప్రదాత :

మహారాష్ట్రలోని మహర్లు 'పతన్‌దార్' (సేద్యబానిసత్వం) అనే వెట్టిచాకిరీలో మగ్గిపోతూ బానిసల్లా బ్రతికే వీరి విముక్తి కోసం డా॥అంబేద్కర్ బొంబాయి గవర్నరైన లార్డ్ లూమ్లీని కలిసి అన్ని వివరాలతో ఒక ముద్రిత పత్రాన్ని సమర్పించాడు పతన్‌దార్లపై కొత్తగా, అన్యాయంగా విధించిన పన్నును రద్దుచేయించాడు. వీరికోసం అసెంబ్లీలో బాంబే హెరిడిటరీ ఆఫీసర్స్ ఏక్ట్ 1874 కి సవరణ బిల్లు ప్రవేశపెట్టాడు. వేలాది మంది పతన్‌దార్లను సమావేశపరచి బిల్లు సవరణదిశగా వారిని చైతన్యపరచి ఉద్యమబాట పట్టించాడు. దీని రద్దుకై 1927లో ఒక బిల్లును, 1937లో మరో బిల్లును ప్రవేశపెట్టాడు. వీరంతా స్వయంశక్తితో గౌరవప్రదమైన వృత్తిలో స్థిరపడి, సుఖంగా జీవించేలా ఉత్తేజపరిచాడు. (ఈ దురాచారం 1959లో పూర్తిగా రద్దయింది).

## ప్రత్యేక నియోజకవర్గాలను సాధించిన ప్రజ్ఞాన్వితుడు :

1930-32 సం॥రాల మధ్య లండన్‌లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాలలో షెడ్యూల్డు కులాల నేతగా పాల్గొని గాంధీ వాదనను తప్పు అని నిరూపించి, బ్రిటిష్ ప్రధాని రామ్సేమేక్డొనాల్డుని ఒప్పించి వారికి ప్రత్యేక నియోజక వర్గాలను (ఎస్సీ ప్రతినిధులను ఎస్సీ ఓటర్లే ఎన్నుకొనే పద్ధతి) సాధించడంలో ఆయన మేధా సంపత్తి, వాదనాశక్తి పోరాట దీప్తి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసాయి, ఆలోచింపచేసాయి. ఈ విధముగా డా॥ అంబేద్కర్ తన జీవితకాలంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి, విజేతగా నిలిచి భరతమాత ముద్దుబిడ్డగా దళిత-బహుజన వైతాళికుడిగా, సకల పీడిత జన విమోచకునిగా. చరితార్థుడైనాడు. (కానీ గాంధీ కుట్రతో ఈ ప్రత్యేక నియోజకవర్గాలు ఆచరణలోకి రాలేదు).

## స్వంత గ్రంథాలయం 'రాజగృహ' స్థాపకుడు :

భారతదేశంలో అతిపెద్ద స్వంత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకొన్నవాడు, పుస్తకాలకోసం ఒక భవనాన్ని నిర్మించుకొన్న ఏకైక భారతీయుడు డా॥ అంబేద్కర్. బొంబాయిలోని ఆయన స్వగృహమైన "రాజగృహ" క్రింది అంతస్థు (Ground Floor) అంతటా గ్రంథాలయమే. దీనిలో సుమారు 45 వేల గ్రంథాలుండేవని ఒక అంచనా. డా॥ అంబేద్కర్ ప్రతి ముఖ్య గ్రంథాన్ని ఏకాగ్రతతో, ఏకసంథాగ్రాహిగా చదివేవాడు. వాటిలోని ముఖ్యాంశాలకు నోట్సు కూడా రాసుకొనేవాడు. అవసరమైనప్పుడు ఏ గ్రంథంలోని ఏ అంశాన్నైనా అలవోకగా ఉదాహరించేవాడు. ఆయన రచనల్లోను, ప్రసంగాల్లోను సందర్భోచితంగా ఎందరో మేధావుల అభిప్రాయాలను పేర్కొనడాన్ని బట్టి మనకిది స్పష్టమవుతోంది. అందుకే ఆయనను నడిచే గ్రంథాలయం, ఏకవ్యక్తి విశ్వవిద్యాలయం అని పలువురు ప్రశంసించేవారు. డా॥ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకొని అక్షరమే ఆయుధం, జ్ఞానమే శక్తి అని "పుస్తకం నా నేస్తం - పఠనం నా క్రాంతి పథం" అని ప్రతి వ్యక్తి నమ్మి ముందుకు సాగాలి.



Scanned with CamScanner

## మహార్లు మరలా సైన్యంలో చేరే మహదవకాశ సాధకుడు :

నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో కష్టతరమైన, అపరిశుభ్రమైన వృత్తులకే పరిమితమైన నిమ్నజాతీయులు బ్రిటిష్‌వారి పాలనలో సైన్యంలో చేరారు. వారి ప్రతిభనూ, పరాక్రమాన్ని నిరూపించుకొని సుబేదార్లు, హవాల్దార్లు, అధ్యాపకుల స్థాయికెదిగారు. అప్పటి బొంబాయి రాష్ట్రంలోని మహర్లతో ఒకప్రత్యేకమైన మహర్ సైనికదళం (బెటాలియన్) ఉండేది. కాని మొదటి ప్రపంచయుద్ధం తరువాత బ్రిటిష్ వారు ఈ బెటాలియన్‌ని రద్దుచేసారు. నిమ్నజాతి యువకులను ఆర్మీలో చేర్చుకోవడంపై ఆంక్షలు విధించారు. ఈ విపత్కర పరిస్థితులలో డా॥అంబేద్కర్ 1941 లో అప్పటి బొంబాయి గవర్నరును స్వయంగా కలిసి దళితుల నిజాయితీని, శౌర్యపరాక్రమాల్ని వివరించాడు. గవర్నరు సంతృప్తిచెంది నిమ్నజాతీయులపై విధించిన ఆంక్షలను రద్దుచేసాడు. దీని ఫలితంగా రెండవ ప్రపంచయుద్ధంలోను, ఇండో–చైనా యుద్ధంలోను మహర్ పటాలం చేసిన వీరోచిత పోరాటం భారత చరిత్రలో చిరస్మరణీయమైంది.

## కార్మిక – శ్రామిక జన బాంధవుడు :

రైతులూ, వ్యవసాయ కార్మికులు ఎండ వానల్లో కష్టపడి పంటలు పండిస్తేనే మనకు రెండు పూటలా తిండి లభిస్తోంది. గనిలో, వనిలో, కార్ఖానాలో శ్రామికుడు చెమటను చిందిస్తేనే ప్రజలకు అవసరమైన వస్తువులు సమకూరుతున్నాయి. ఈ శ్రమజీవుల్లో అధిక సంఖ్యాకులు నిమ్నకులాలకు చెందినవారే. వీరిలో పుట్టి పెరిగిన డా॥అంబేద్కర్‌కి వీరి జీవన స్థితిగతులూ, కష్టనష్టాలు క్షుణ్ణంగా తెలుసు. బ్రిటిషువారి పాలనలో ముస్లింలకు వలెనే దళితులకూ ప్రాతినిధ్యం ఇచ్చితీరాలని డా॥ అంబేద్కర్ బ్రిటిష్ అధికారుల దృష్టికి తెచ్చాడు. ఆయన నిర్విరామ కృషి ఫలితంగానే అన్నివిధాలా సమర్థుడైన డా॥ అంబేద్కర్‌ని 1942 జూలై 20వతేదిన బ్రిటిష్ ప్రభుత్వము వైశ్రాయ్ కార్యనిర్వాహక వర్గంలో కార్మిక సభ్యునిగా (మంత్రిస్థాయి) నియమించింది. ఈయన ఈ పదవిలో కొనసాగిన 4 సంవత్సరాలలో కార్మిక సంక్షేమానికి అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టి విశ్వవిఖ్యాత కార్మికనేతగా చరిత్రలో నిలిచిపోయాడు. కార్మికులు, యజమానులు, ప్రభుత్వం– ఈ మూడు వర్గాల మధ్య సామరస్యం ఉంటేనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని చాటిచెప్పి దేశవ్యాప్తంగా ఈ మూడు పక్షాలను సంఘటితపరిచాడు. విద్యావంతులకు, సాంకేతిక శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిల ద్వారా ఉద్యోగాల కల్పనకు ఏర్పాటులు చేసాడు. శ్రామికుల తక్షణ అవసరాలైన ఆహారం, గృహవసతి, విద్య, ఆరోగ్యాది సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక శాఖను నియమించాడు. పేదరికం దేశానికి ప్రబల శత్రువు కనుక దీని నిర్మూలనకు ధనవంతులు తమ వంతు సహకారమునందించాలని సూచించాడు. వివిధ శాఖలలోను, విదేశాలలోను శిక్షణ పొందుటకు నిమ్నజాతులకు 8.83% సీట్లను కేటాయింపచేసాడు. ఫ్యాక్టరీల చట్టాలను సవరించి కార్మికులకు జీతంతో కూడిన సెలవులు మంజూరు చేసాడు. పరిశ్రమల / ఫ్యాక్టరీల కార్మికుల పనిగంటలను తగ్గించాడు. ఇండియా గనుల చట్టాలను సవరించి, గనికార్మికుల సౌకర్యాలను పెంచాడు. కార్మికుల సామాజిక బీమా ఈయన కాలములోనే అమలులోకి వచ్చింది. కార్మిక స్త్రీలకు ప్రసూతి సెలవు, ఇతర సౌకర్యాలు



Scanned with CamScan

కల్పించబడ్డాయి. బొగ్గు గనులలో త్రాగునీరు, పారిశుద్య సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇండియన్ ట్రేడ్ యూనియన్ బిల్లు 1947లో కేంద్ర శాసనసభలో రెండవ దఫాగా ప్రవేశపెట్టినవాడు డా॥అంబేద్కరే. ఈ బిల్లు అదే సంవత్సరంలో చట్టరూపం దాల్చింది. కార్మికుల సమస్యలను సానుభూతితో పరిశీలించడం, సమర్ధతతో పరిష్కరించడం. డా॥అంబేద్కర్ కార్మిక మంత్రిగా ఉన్నకాలంలోనే ప్రారంభమైంది. కనీస వేతన చట్టాన్ని, బోనస్ చట్టాన్ని శ్రమజీవుల శ్రేయోభివృద్ధికి అనుకూలంగా సవరింపచేసాడు. వతన్‌దారీ / కోతీ పద్ధతిలో వెట్టిచాకిరీలో మగ్గుతున్న వ్యవసాయ కార్మికులకు శాంతియుత పోరాటంతో విముక్తిని కల్గించాడు. "రాజ్యాధికారం లేకుండా కార్మికుల సమస్యలు పరిష్కారం కావు. దారిద్ర్య నిర్మూలనకోసం, సర్వజన సంక్షేమం కోసం కార్మికులంతా సమైక్యంగా ముందుకు సాగి స్వతంత్ర భారతంలో రాజ్యాధికారాన్ని చేపట్టాలి." అని ఉద్బోధించిన ప్రజాస్వామిక సామ్యవాది. ఈ విధంగా స్వల్ప అధికార వ్యవధిలో అనల్పమైన సంక్షేమ పథకాలను అమలు జరిపి కార్మిక, శ్రామిక జనబాంధవునిగా ప్రశస్తినందిన మాన్యుడూ, అసామాన్యుడు డా॥అంబేద్కర్.

## అనితరసాధ్యమైన విద్యాప్రదాత :

తన మాతృదేశంలోనే బడికీ, గుడికి దూరంగా ఉంచబడినా, డా॥ అంబేద్కర్ ఈ దేశంలో అందరికంటే అత్యున్నత విద్యను అభ్యసించాడు. అంతేగాక నిమ్న - నిరుపేద ప్రజల విద్యాభివృద్ధి కోసం 1924లో "బహిష్కృత హితకారిణి" సభను, 1928లో అణగారిన వర్గాల విద్యాసంఘమును నెలకొల్పి వీటిద్వారా వసతి గృహాలను, గ్రంథాలయాలను ఏర్పాటు చేసాడు. 1946లో "పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ"ని స్థాపించి దీని ద్వారా పాఠశాలలను, కళాశాలలను, వసతి గృహాలను నెలకొల్పాడు. 1999 నాటికి ఈ సంస్థ ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో 30 విద్యాసంస్థలు స్థాపించబడ్డాయి. ఇవన్నీ బుద్ధుని విశిష్ఠ ధమ్మానికి, డా॥ అంబేద్కర్ ఆశయాలకి అనుగుణంగా లక్షలాది విద్యార్థులకు విద్యాదానం చేస్తున్నాయి. దేశానికి వేలాది ఉత్తమ పౌరులను అందిస్తున్నాయి. ముంబైలోని "సిద్ధార్థ కాలేజి ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ & కామర్స్, సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ లా, ఔరంగాబాద్‌లోని మిళింద మహావిద్యాలయ, నాందేడ్‌లోని నాగసేన్ జూనియర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & కామర్స్" - వీటిలో కొన్ని.

## నవ భారత రాజ్యాంగ నిర్మాత :

డా॥ అంబేద్కర్‌కి అమెరికా, ఇంగ్లండు వంటి ఆరు దేశాల రాజ్యాంగాలు అక్షరాక్షరం తెలుసు. మరో 16 దేశాల రాజ్యాంగాలపై పూర్తి అవగాహన ఉంది. అందుకే ఆయన రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. వ్యక్తిగత కారణాల వలన ఆ సంఘ సభ్యులు (1+6) ఎవ్వరూ ఏ మాత్రం సహకరించకపోయినా, తానే ఒక్కడిగా రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులలో, క్షీణిస్తున్న తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా నిర్విరామంగా శ్రమించి మన దేశానికి చక్కని రాజ్యాంగాన్ని సమకూర్చాడు. రాజ్యాంగ నిర్మాణం పరంగా ఆయన రుణం తీర్చుకోలేనిదని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు, భారతదేశ



Scanned with CamScanner

ప్రథమ రాష్ట్రపతి అయిన డా॥ రాజేంద్రప్రసాద్, రాజ్యాంగ రచనా సంఘ సభ్యుడు మరియు ప్రథమ రక్షణశాఖామంత్రి అయిన టి.టి. కృష్ణమాచారి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు మొదలగువారు ప్రశంసించారు. డా॥ అంబేద్కర్ రచించిన మన భారత రాజ్యాంగము దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనకు మార్గదర్శకమైందని నోబెల్ (శాంతి) బహుమతి గ్రహీత అయిన డా॥ నెల్సన్ మండేలా కొనియాడాడు. అనేక కులాలు (6 వేలు), మతాలు, భాషలున్న మన దేశంలో గత 60 సంవత్సరాలుగా అవసరమైన మార్పులు, చేర్పులతో అజరామరంగా కొనసాగడాన్ని బట్టే మన రాజ్యాంగపు గొప్పతనాన్ని, దాని నిర్మాతయొక్క ప్రతిభా సామర్థ్యాలను గ్రహించవచ్చును.

## దళిత – బహుజన దాస్య విమోచకుడు :

డా॥ అంబేద్కర్ చిన్ననాటి నుండి అస్పృశ్యత, కులవివక్షతలపరంగా అనేక అవమానాల పాలయినాడు. అంటరాని కులానికి చెందినవాడని బడిలో విడిగా కూర్చోబెట్టారు. గుడి గడప దాటకూడదన్నారు. బర్రెకు బొచ్చు కత్తిరించే మంగలి క్రాపు చెయ్యనన్నాడు. దాహానికి మంచినీళ్ళు అడిగితే మురికి గుంట చూపించారు. బండివాడు సయితం మైలు పాటించాడు. బరోడా సంస్థానంలో తాను ఉన్నతోద్యోగి అయినా బంట్రోతు ఆయనను అంటరానివానిగానే చూసాడు. ఇలా ఆయన గుండెల నిండా ఎన్నో మాయని గాయాలు. అందుకే అంటరానివారిగా, చూడరానివారిగా, చేరరానివారిగా, నిరుపేదలుగా, నిరక్షరాస్యులుగా అలమటిస్తున్న తన దళిత ప్రజల భుక్తి కోసం, విముక్తి కోసం, అభివృద్ధి కోసం, స్వాభిమానం కోసం అనేక ఉద్యమాలను నిర్వహించాడు. తన అలుపెరుగని పోరాట పటిమతో, అపార మేధాసంపత్తితో అస్పృశ్యతను రాజ్యాంగపు 17వ ప్రకరణం ద్వారా నిషేధింపచేసాడు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7 శాతం విద్యా – ఉద్యోగ – రాజకీయాది రంగాలలో రిజర్వేషన్‌లను సాధించాడు. ఈ రాయితీల ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన లక్షలాది మంది ఉన్నత విద్యలను అభ్యసించి, ఉన్నతోద్యోగులయినారు. వేలాది మంది పంచాయితీ సభ్యుడి స్థాయి నుండి భారత రాష్ట్రపతి దాకా రాజకీయ పదవులలో రాణించగల్గుచున్నారు. ఒకనాటి ఆఫ్రో – అమెరికన్లు అనుభవించిన బానిసత్వం కన్నా అస్పృశ్యత నీచమైనది, ఆఫ్రికా నల్లజాతీయులు చవిచూసిన వర్ణవివక్షతకన్నా కులవివక్షత క్రూరమైనదని అనుభవంతో గ్రహించిన బాబాసాహెబ్ వీటి నిర్మూలనకు పాటుపడి ప్రపంచ చరిత్రలో ఒక మోజెస్, ఒక స్పార్టకస్, ఒక బూకర్ టి. వాషింగ్టన్, మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలాల కన్నా గొప్ప సంఘ సంస్కర్తగా, పీడిత జన విమోచకుడిగా మానవ చరిత్రలో నిలిచిపోయాడు.

## బానిసత్వంలో మ్రగ్గుతున్న భారత స్త్రీ జనోద్ధారకుడు :

భారతదేశంలో స్త్రీ స్వేచ్ఛకు ప్రప్రథమంగా ద్వారాలు తెరచిన మానవోత్తముడు గౌతమ బుద్ధుడు. ఆయన స్ఫూర్తితోనే డా॥ అంబేద్కర్ స్త్రీజనోద్ధరణకు నడుంకట్టి పనిచేసాడు. వైశ్రాయి కమిటీలో కార్మిక సభ్యుని (మంత్రి)గా పనిచేసినప్పుడు మహిళా ఉద్యోగులకు జీతంతో కూడిన ప్రసూతి సెలవును మంజూరు చేయించాడు. ఆదివారం జీతంతోపాటు సెలవు, పని గంటల



Scanned with CamScan

తగ్గింపు పనిలో ప్రమాదానికి నష్టపరిహారం మొదలగు సదుపాయాలను కార్మికనేతగా, కార్మికమంత్రిగా బాబాసాహెబే ఏర్పాటుచేసాడు. అంతేగాక అన్ని రంగాలలోను స్త్రీలకు, పురుషులతో సమాన హక్కులు దక్కేటందుకు ప్రథమ న్యాయశాఖామంత్రి హోదాలో హిందూకోడ్ బిల్లును తయారు చేసాడు. అయితే హిందూ మత ఛాందసులు వ్యతిరేకించడంతో, అప్పటి ప్రధాని నెహ్రూయే మాటతప్పడంతో తన ఆశయం నెరవేరనందుకు కేంద్రప్రభుత్వంలో కేబినెట్ మంత్రిపదవికే రాజీనామాచేసాడు. అయినా గుడ్డిలో మెల్లలా ఈ బిల్లులో డా॥ అంబేద్కర్ సూచించిన బహుభార్యత్వ నిషేధం, స్త్రీ పునర్వివాహం, స్త్రీలకు దత్త స్వీకార హక్కు మొ॥నవి అమలులోకి వచ్చాయి. నేడు వివిధ రంగాలలో స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు లభించడానికి, ఉద్యోగాలలో, రాజకీయ పదవులలో మహిళా రిజర్వేషన్లు అమలుకావడానికి ఆనాడు ఆయన చూపిన మార్గమే ఆచరణలోకి వచ్చింది. కాని స్త్రీ జనోద్ధారకుడైన డా॥ అంబేద్కర్ చేసిన అవిరళ కృషిని, అనితర సాధ్యమైన త్యాగాన్ని వ్యష్టిగా మహిళ(లు), సమిష్టిగా మహిళా సంఘాలు గుర్తించకపోవడం విచారకరం.

## బౌద్ధధమ్మాన్ని పునరుద్ధరించిన బోధిసత్త్వుడు, నవబుద్ధుడు :

డా॥ అంబేద్కర్ బుద్ధుడు, కబీరు, పూలేలను తన గురువులుగా స్వీకరించాడు. వీరిలో గౌతమబుద్ధుని మహోన్నత వ్యక్తిత్వం పట్ల, ఆయన మానవీయ ధమ్మంపట్ల బాల్యంనుండి ఆకర్షితుడైనాడు. అన్ని మత గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సర్వమానవాళికి సుఖశాంతులను అందించే జీవన మార్గం బౌద్ధమని గ్రహించాడు. మన రాజ్యాంగంలో బౌద్ధానికి చెందిన మౌళిక సూత్రాలను పొందుపరిచాడు. భారత జాతీయ పతాకంలో అశోక ధర్మచక్రం చేర్చబడడానికి సారనాథ్‌లోని నాలుగు సింహాల శిల్పం (నాల్గవది కనిపించదు) మన జాతీయ చిహ్నం కావడానికి డా॥ అంబేద్కరే కారకుడు. 1956 అక్టోబర్ 14వ తేదీన (అశోక విజయదశమి) 6 లక్షల మంది అనుచరులతో నాగపూర్ దీక్షాభూమిలో బౌద్ధధమ్మాన్ని స్వీకరించి చరిత్ర సృష్టించాడు. శ్రీలంక, మయన్మార్ (బర్మా), నేపాల్ వంటి దేశాలలో జరిగిన నాలుగు ప్రపంచ బౌద్ధ మహాసభలలో ప్రసంగించి బౌద్ధధమ్మ విశిష్టతను చాటిచెప్పాడు. "బుద్ధుడు – బౌద్ధధమ్మం", "బుద్దుడు – కారల్‌మార్క్స్", "పాళీ డిక్షనరీ" వంటి జగత్ ప్రసిద్ధ బౌద్ధ గ్రంథాలను రచించి ఆంగ్లభాషలో బౌద్ధసాహిత్యపు లోటును తీర్చాడు. బౌద్ధధమ్మ వ్యాప్తికోసం భారతీయ బౌద్ధమహాసభ ను స్థాపించి 1955లో రిజిష్టర్ చేయించాడు. "బోధిసత్వ", "నవబుద్ధ" బిరుదులతో సత్కరించబడిన డా॥ అంబేద్కర్ అశోక చక్రవర్తి తరువాత మన దేశంలో బౌద్ధాన్ని పునరుద్ధరించిన మహాపురుషుడు. ఆయన స్ఫూర్తిగానే లక్షలాది దళితులు, దళితేతరులు బౌద్ధాన్ని స్వీకరిస్తున్నారు (గత 54 సంవత్సరాలలో వీరి సంఖ్య 10 లక్షల నుండి 110 లక్షలకు పెరిగింది). నేడు విశ్వమతంగా వెలుగొందుచున్న బౌద్ధానికి పుట్టినిల్లయిన భారతదేశం తిరిగి బౌద్ధ భారతంగా విరాజిల్లుతుందని ఆశిద్దాం.

## మేటి రాజనీతిజ్ఞుడు – బహుజన రాజ్యాధికార నిర్దేశకుడు :

ఒకనాడు భారతదేశాన్ని పాలించిన నాగ జాతీయుల వారసులే నేడు పాలితులుగా ఉన్న బహుజనులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు – దేశ జనాభాలో 85 శాతం) వీరి సమస్త



Scanned with CamScanner

సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారమే శరణ్యమని, వీరి అధికారంతో మాత్రమే ఈ దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం, సమసమాజం ఏర్పడతాయని, అందుకు బహుజనులందరూ ఒకే త్రాటిపై నిలచి, ఒకే జెండాతో, ఒకే ఎజెండాతో ముందుకు సాగాలని ఉద్బోధించిన మన మార్గదర్శకుడు డా॥ అంబేద్కర్.

ఈ లక్ష్య సాధనకోసం ఆయన జీవిత కాలంలో అప్పటి రాజకీయ, సాంఘిక పరిస్థితులను బట్టి ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (1937), షెడ్యూల్డు కులాల సమాఖ్య (1942), రిపబ్లికన్ పార్టీ (1956)లను ఒక క్రమంలో స్థాపించుకుంటూ వచ్చాడు. 1937లో బొంబాయి అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ 17 స్థానాలకు పోటీచేసి 15 స్థానాలను గెలుచుకొని బహుజనుల ఐక్యతను చాటిచెప్పింది. కానీ ఆ తరువాతి కాలంలో బహుజనులు అగ్రవర్ణాల బ్రాహ్మణీయ కుట్రలకు పావులై వారి జెండాలు మోసే తండాలుగా మారి రాజ్యాధికారానికి దూరమైనారు. ఇప్పటికైనా పూలే, అంబేద్కర్‌లను తమ ఉజ్వల భవిష్యత్తుకు నిర్దేశకులుగా భావించి ఒకే రాజకీయ శక్తిగా ముందుకు సాగి రాజ్యాధికారాన్ని చేజిక్కుంచుకొని బహుజనుల, సమస్త భారతీయుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతారని ఆశిద్దాం.

## నిఖిల జగతి కీర్తించిన నిష్కళంక దేశభక్తుడు :

"నా ప్రజలు ప్రథమంగాను – అంతిమంగాను భారతీయులుగానే ఉండాలని, మరెవరూ కాకూడదని కోరుకుంటున్నాను" – అని ఉద్ఘాటించిన మాన్యుడూ, అసామాన్యుడు డా॥ అంబేద్కర్. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ (1930–32)లలో ఆయన ప్రసంగాలను పరిశీలించినా, బ్రిటిష్ వైస్రాయికి ఆయన సమర్పించిన విజ్ఞాపన పత్రాలను పరికించినా, స్టాఫర్డ్ క్రిప్స్, సైమన్‌ల వంటి బ్రిటిష్ పరిశీలకులకు ఇచ్చిన రిపోర్టులను చూసినా వాటిలో ఆయన దేశభక్తి – పీడిత ప్రజానురక్తి ప్రస్ఫుటమౌతాయి. దేశ స్వాతంత్ర్యంతోపాటు దేశజనాభాలో 25 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక, మతపరమైన స్వేచ్ఛను ఆశించడం, "ఒక మనిషికి ఒకే ఓటు – ఒక ఓటుకి ఒకే విలువ" ఉండాలని సూచించడం, బ్రిటిష్‌వారితోపాటు పీడిత జన వ్యతిరేకులతో పోరాడడం ఆయన మానవీయతను, భారతీయతను చాటిచెబుతాయి. జిన్నా పాకిస్థాన్‌ను కోరినట్లు డా॥ అంబేద్కర్ దళిత్‌స్థాన్‌ను కోరకపోవడం, గాంధీ ప్రాణరక్షణ కోసం తాను సాధించిన ప్రత్యేక నియోజకవర్గాలను వదులుకోవడం, తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా ఒక్కడిగా రాజ్యాంగాన్ని రచించి ఇవ్వడం, దేశ జనాభాలో సగమైన స్త్రీల సముద్ధరణ కోసం హిందూకోడ్ బిల్లును సిద్ధపరచడం – దాని వైఫల్యంతో కేంద్రమంత్రి పదవినే తృణప్రాయంగా వదిలేయడం, విదేశీ మతాలను స్వీకరించకుండా ఒకనాటి మన జాతీయ మతమైన బౌద్ధాన్ని స్వీకరించడం, భాక్రానంగల్, దామోదర లోయవంటి జాతీయ ప్రాజెక్టులను రూపకల్పన చేయడం, జాతీయ చిహ్నాన్ని ఎంపికచేయడం, జాతీయ పతాకాన్ని రూపొందించడం – ఇవన్నీ ఆయన నిష్కళంక దేశభక్తికి నిలువెత్తు నిదర్శనాలే.

## మమతకు సన్నిధి – మానవతకు పెన్నిధి :

ఉప్పు సముద్రంలోంచి అమృతం పుట్టిందనేది ఒక పురాణగాథ. కాని కష్టాల కడలిలోంచి ఒక జ్ఞాన సూర్యుడు, ఒక ఉద్యమ భానుడు ఉదయించాడనేనిది ఒక వాస్తవ గాథ. మాయని



Scanned with CamScanner

గాయాలలోంచి మానవత గుబాళించిన ఒక మానవోత్తముడు ఎదిగివచ్చాడు. ఆయనే డా॥అంబేద్కర్ మానవాళికి మార్గదాత, మానవతకు స్ఫూర్తి ప్రదాత అయిన గౌతమ బుద్ధుని తన ప్రథమ గురువుగా స్వీకరించాడు. బుద్ధునివలెనే మానవతకు ప్రతీకలైన ప్రేమ, కరుణ,శీలం, సమత, మైత్రి, సానుభూతి, సహకారం క్షమాగుణం మొదలైన విశిష్ట లక్షణాలను తన ప్రతి అణువునా నింపుకొన్నాడు. ఆయన ఆలోచనలు, ఆశయాలు అన్నీ వాస్తవిక మానవీయత పునాదిగా రూపొందినవే. అష్టకష్టాలతో, అవమానాలతో జీవించే అభాగ్యుల పట్ల ఆయనకు అపారమైన సానుభూతి ఉండేది. వారికి స్వేచ్ఛాయుతమైన, సంతోషకరమైన జీవితాన్ని అందించాలని తపన ఉండేది. ఈ లక్ష్య సాధన కోసం తన వ్యక్తిగత ఆశలని, ఆనందల్నీ సైతం త్యాగం చేసాడు. పీడిత జనావళిని చైతన్యపరచి, సంఘటితపరచి, ఉద్యమాల బాటలో నడిపించాడు. వారు కోల్పోయిన హక్కులను సాహసంతో, విశ్వాసంతో కడదాకా పోరాడి సాధించుకొనే యోధులుగా, విజేతలుగా తీర్చిదిద్దాడు. మానవ సంబంధాలు వ్యాపారబంధాలుగా మారిపోతున్న కాలంలో ప్రజల మధ్య స్వచ్ఛమైన ప్రేమ పరస్పర సహకారాలను పెంపొందింప చేసాడు. అసలు సిసలు మానవుడు, అణచివేతకు గురి అయినవాడు తన ప్రజలను సాంఘిక బానిసత్వమునుండి విముక్తులను చేయడానికి అంకితభావంతో పాటుపడాలని సూచించాడు, ఈ సూచనను తన జీవితాంతం ఆచరించి చూపించాడు. సమాజంలో తన దృష్టికి వచ్చిన ప్రతి అన్యాయాన్ని, అవినీతిని, అణచివేతను, ఊచకోతను అంతమొందించడానికి నిర్భయంగా, నిష్పక్షపాతంగా కృషిచేసాడు. తథాగతుని (బుద్ధుని) బోధనలలోని మానవీయతతో ప్రభావితుడైన డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిపౌరునికి సంపూర్ణ స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, సాంఘిక న్యాయం చేకూరాలని తాను రూపొందించిన నవభారత రాజ్యాంగ ప్రవేశిక లోనే పేర్కొన్నాడు. తన అసాధారణ మేధాశక్తితో, అవిశ్రాంత ఉద్యమ దీప్తితో సుమారు 20 కోట్ల షెడ్యూల్డ్ కులాలవారిని అమానుషమైన అస్పృశ్యతనుండి విముక్తులను చేసాడు. వారి అభివృద్ధికోసం రాజ్యాంగ బద్ధంగా విద్యా - ఉద్యోగ - రాజాకీయాది రాయితీలను సాధించడం మానవతకే ఒక మహోన్నత విజయం.

అట్లే వెనుకబడిన తరగతులూ అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతికోసం ప్రత్యేక కమీషన్‌లు ఉండాలని నిర్దేశించినవాడు, పురుషులతో పాటు స్త్రీలకు అన్ని రంగాలలోను సమాన హక్కులూ, అవకాశాలను కల్పించేందుకు హిందూ కోడ్ బిల్లును తయారుచేసిన సర్వజన సంక్షేమ సారథి డా॥అంబేద్కర్. మానవతా విలువలతో విరాజిల్లే బౌద్ధ ధమ్మాన్ని భారతావనిలో పునరుద్ధరించి సర్వజన హితానికి, సర్వజన సుఖానికి అంకితమైన మహోన్నత మానవతావాది డా॥ అంబేద్కర్.

## అసాధారణ త్యాగధనుడు – అపూర్వ కరుణామయుడు :

అనితర సాధ్యమైన ప్రతిభా సంపన్నుడూ, అత్యున్నత విద్యార్హతలను సాధించిన మహామేధావి అయిన డా॥అంబేద్కర్ ఇష్టపడితే ఇంగ్లడ్, అమెరికా, జర్మనీ వంటి ఏదేశములోనైనా ఒక ఉన్నతోద్యోగములో స్థిరపడి అష్టైశ్వర్యాలతో ఆనందంగా జీవించి ఉండేవాడు. కాని అలా చెయ్యలేదు. న్యాయ శాస్త్రంలో, రాజ్యాంగ శాస్త్రంలో ఆయనకున్న

అపార జ్ఞానాన్ని గుర్తించి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వంవారు జిల్లా జడ్జి ఉద్యోగములో చేరమని కోరారు. మూడు సంవత్సరాలలోనే హైకోర్టు జడ్జిగా ప్రమోషన్ ఇస్తామని అభయమిచ్చారు. ఈ పదవులను అంగీకరించి ఉంటే ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రిటైరై ఉండేవాడు. కాని అందుకు అంగీకరించలేదు. తనకు అత్యంత ప్రీతి పాత్రమైన అధ్యాపక వృత్తిని కూడా విడిచి పెట్టి, ప్రజాసేవకు, రచనా వ్యాసంగానికి అడ్డురాని న్యాయవాద వృత్తినే ఎంచుకొన్నాడు. కాంగ్రెస్‌పార్టీకి చెందకపోయినా ఆయన బహుముఖ ప్రజ్ఞాపాటవాలను మెచ్చి మన ప్రథమ ప్రధాని అయిన పండిట్ జవహరలాల్ నెహ్రూ తన మంత్రి వర్గంలోకి స్వాగతించి ఆయనకు ఈ దేశ ప్రథమ న్యాయశాఖామంత్రి పదవిని అప్పగించాడు. అంతేకాక ఆయనను తన మంత్రివర్గంలో మణిపూస లాంటి వాడని ప్రశంసించాడు. డా॥అంబేడ్కర్ కాంగ్రెస్‌తో రాజీపడి ఉంటే భారతదేశానికి మొదటి మేటి దళిత రాష్ట్రపతిగా చరిత్ర పుటలలో నిలిచి ఉండేవాడు. కాని హిందూ కోడ్ బిల్లు తాను ఆశించినట్లు ఆమోదించబడని కారణంగా నిరసనతో తన మంత్రి పదవికే రాజీనామా చేసాడు. డా॥అంబేడ్కర్ తన కుటుంబ క్షేమం కంటే సమాజ సంక్షేమానికే ప్రాధాన్యతను ఇచ్చిన త్యాగపురుషుడాయన. ఈ లక్ష్యసాధనలో నిరంతర అధ్యయనం, రచనావ్యాసంగం, సభలూ, ఉద్యమాలతో ఆయనకు క్షణం తీరిక ఉండేది కాదు. ఈ అనివార్య పరిస్థితులలో ఆయన తన భార్యాబిడ్డల యోగక్షేమాలపట్ల తగిన శ్రద్ధ వహించలేకపోయాడు.

అందుచేతనే వారి 5 గురి సంతానంలో ముగ్గురు కుమారులు ఒక కుమార్తె పిన్న వయసులోనే కన్నుమూసారు. ఆయన ఆదర్శ ధర్మపత్ని అయిన రమాబాయి 39 సంవత్సరాల మధ్య వయసులోనే, 1935లో నిర్యాణం చెందింది. ఆమె మరణించిన 13 సంవత్సరాల తరువాత, ఆరోగ్యరీత్యా తప్పనిసరియై తోడు కోసం డా॥అంబేడ్కర్ 1948లో డా॥ శారదాకబీరు అను బ్రాహ్మణ వనితను రెండవ పెళ్ళిచేసుకున్నాడు. ఆయన ఆకస్మిక మరణానికి గాని, ఆర్థిసమస్యలతో గాని దళిత ఉద్యమం ఆగిపోకోదదని, అవసరమైతే తన నివాసమైన 'రాజగృహ'ను అమ్మి ఆ సొమ్ముతో దళిత ఉద్యమాన్ని నడిపించమని ఒక వీలునామా వ్రాసి దాదాసాహెబ్ గైక్వాడ్ దగ్గర ఉంచాడు.

డా॥బి.ఆర్. అంబేడ్కర్ కరుణకు ప్రతిరూపం. ఆయన ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా, పనిఒత్తిడిలో మునిగియున్నా అవసరమైన వారికి, ఆపదలో ఉన్నవారికి ఆర్ద్ర హృదయంతో తన శక్తికొలది సాయపడేవాడు. నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయమందించాడు. నిరుద్యోగులకు బ్రతుకుతెరువు చూపించాడు. తన ఇంటి నౌకర్లను ప్రేమతో ఆదరించాడు. తనను చంపేస్తామని ఉత్తరాలతో, టెలిగ్రాములతో బెదిరించినవారిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చెయ్యలేదు. ఆయనపై 9 హత్యా యత్నాలు జరిగినా ఎవరిపైనా క్రిమినల్ కేసులు పెట్టలేదు. బరోడా సంస్థానంలో తన క్రింది ఉద్యోగులు అస్పృశ్యతను పాటించి అవమానించినా, అధికారముండి వారిపై చర్య తీసుకొనలేదు. ఈ విధంగా దయానిధులైన బుద్ధుడు, మహాత్మపూలేల అడుగుజాడల్లో ఆపన్నులకు సహకార హస్తమును అందించి, హత్యకు తెగించిన వారికైనా క్షమాభిక్ష ప్రసాదించి మానవ చరిత్రలో మరో కరుణామయునిగా మనందరికి మార్గదర్శియైనాడు.



Scanned with CamScanner

## ప్రపంచ పీడిత జన వైతాళికుడు :

డా॥ బాబాసాహేబ్ అంబేద్కర్ ఒక్క దళితుల లేదా భారత పీడిత ప్రజల విమోచకుడే కాదు. ఆఫ్రికా ఖండంలోని వివిధ నల్లజాతీయులకు, అమెరికాలోని ఆఫ్రో-అమెరికన్‌లకు, ఐరోపా దేశాలలోని రోమా (జిప్సి)లకు జపాన్‌లోని బురాకుమిన్‌లకు ఒక స్ఫూర్తి ప్రదాత, ఒక వైతాళికుడు. భారతదేశములోని దళితులవలెనే ఈ ప్రాంతాలలో వివక్షతకు గురి అవుతున్న నల్లజాతి ప్రజలు డా॥ అంబేద్కర్ ఆదర్శ జీవితాన్ని, అనితర సాధ్యమైన ఆయన ఉద్యమ చరిత్రను అధ్యయనం చేస్తున్నారు. ఆయన ఆలోచనా విధానమే వారి ప్రగతికి, సుగతికి మార్గదర్శకమని నమ్మి ముందుకు సాగుతున్నారు. (దళితవాయిస్, దక్కన్ క్రానికల్ ఆధారంగా)

## మహా పురుషుని మహా పరినిర్వాణం :

సూర్యుడు ఉన్నంతకాలం, ఈ భూమిపై సృష్టి స్థిరంగా, సజీవంగా ఉంటుంది. ఈ సృష్టి ఉన్నంతకాలం జ్ఞానసూర్యులూ, త్యాగశీలురూ భౌతికంగా మన ముందు లేకున్నా మన ప్రగతి పథంలో ధృవతారలూ, మన సుఖజీవన మార్గంలో ఒక మధుర స్మృతులుగా నిలిచిపోతారు. డా॥ బాబాసాహేబ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6వ తేదీన పరినిర్వాణం చెందాడు. అయినా ఆయన మనందరి స్మృతిపథంలో అమరుడు, చిరస్మరణీయుడు

# సవేర రచనలు

**I. కవిత్వం :** 1. సుమాంజలి 2. బృందావనం 3. వెలుగుబాట 4. ఈ మోడులు చిగురించాలి 5. వీడ్కోలు 6. దళిత జాతుల ధర్మయుద్ధం 7. సమైక్య భారతి 8. నెత్తుటి మంటలు 9. సవేర పద్యమంజరి 10. బౌద్ధ గీతాలు 11. బుద్ధుని బోధనలు (శతకం).

**II. వచనం :** 1. హరిజన్ అనే పదాన్ని నిషేధించండి 2. దళిత చైతన్య లహరి 3. భగవాన్ బుద్ధునికి ప్రముఖుల నీరాజనాలు & సవేర వ్యాసాలు 4. బుద్ధుని అనుసరించిన ప్రసిద్ధ మహిళలు 5. బౌద్ధధమ్మ విశిష్టత (వ్యాససంపుటి) 6. స్త్రీ జాతి విమోచకుడు డా॥ అంబేద్కర్ 7. బౌద్ధధమ్మ పునరుద్ధారకులు 8. డా॥ అంబేద్కర్ సూచించినట్లుగా బౌద్ధాన్ని స్వీకరిద్దాం రండి !, 9. ధమ్మచక్ర ప్రవర్తన – దాని ప్రాముఖ్యత. 10. నేటి వేలాది దేవాలయాలు ఒకనాటి బౌద్ధ క్షేత్రాలు.


**III. అనువాదాలు :** 1. దళితులే ఆది భారతీయులు 2. నాగభూమి – దళితుల చరిత్ర 3. డా॥ అంబేద్కర్ మూడు ఆజ్ఞలు 4. బుద్ధ చరిత్ర (డా॥ అంబేద్కర్ రచించిన బుద్ధ అండ్ హిజ్ ధమ్మ ఆధారంగా), 5. "జైభీమ్" – దీని చారిత్రక నేపథ్యం.

**IV. సంకలనాలు :** 1. డా॥ అంబేద్కర్ అద్భుత సూక్తులు 2. డా॥ అంబేద్కర్‌కి అక్షర నీరాజనం (పాటలు) 3. బౌద్ధధమ్మ విస్తరణ కోసం డా॥ అంబేద్కర్ సందేశం, 4. డా॥ అంబేద్కర్ అందుకొన్న ప్రముఖుల ప్రశంసలు, 5. తరతరాలకు మన తెలుగువెలుగు.


**V. జీవిత చరిత్రలు :** 1. కాన్షీరామ్ 2. జి.యం.సి. బాలయోగి 3. డా॥ యెండ్లూరి 4. మానవాళికి మార్గదాత గౌతమబుద్ధుడు, 5. మాతా రమాబాయి, 6. ఉపాసక పి. అబ్బాయి.



Scanned with CamScan



డా॥ అంబేడ్కర్ తన స్వంత లైబ్రరీ కోసం నిర్మించిన "రాజగృహ" (ముంబై)



డా॥ అంబేడ్కర్ బౌద్ధధమ్మాన్ని స్వీకరించిన "దీక్షాభూమి" (నాగపూర్, 14-10-1956)




దాదర్ (ముంబై) లోని చైత్యభూమి (డా॥ అంబేడ్కర్ సమాధి)

Scanned with CamScanner

# సవేర అందుకొన్న జాతీయ - అంతర్జాతీయ అవార్డులు ;
# పాల్గొన్న ఇంటర్నేషనల్ & నేషనల్ సెమినార్‌లు




వరల్డ్ బుద్ధిస్ట్ కన్వెన్షన్ - నాగపూర్-అక్టోబరు 2006లో డా॥ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ లిటరరీ అవార్డును స్వీకరించి, ప్రసంగిస్తున్న **సవేర**



భారతీయ దళిత సాహిత్య అకాడమీ-ఢిల్లీ వారి "డా॥ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు" ను, గోల్డ్ మెడలును అందుకొంటున్న **సవేర**



ఆంధ్రాయూనివర్సిటీ వారి - జాతీయ (యు.జి.సి) సదస్సు-2006లో "తెలుగు సాహిత్యంపై బౌద్ధ ధమ్మ ప్రభావం" పరిశోధనాపత్రాన్ని సమర్పిస్తున్న **సవేర**



2007లో పద్మావతీ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ (యు.జి.సి) సదస్సులో "The Historic Role of Dr. Ambedkar in the Revival of Buddhism" **సవేర** పత్ర సమర్పణ




కాకతీయ యూనివర్సిటీ - జాతీయ సదస్సులో "దళిత జనోద్ధరణలో సాహుమహారాజు -పూలే డా॥ అంబేడ్కర్‌ల పాత్ర" - **సవేర** పత్ర సమర్పణ




రామచంద్రపురం పి.జి.సెంటర్ - యు.జి.సి. సెమినార్‌లో "The Need of Buddhism in the Modern World" - **సవేర** పత్ర సమర్పణ

Scanned with CamScan